విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌ అందజేత



దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ పరిధిలోని ఎన్టీఆర్‌ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్‌ నాయకుడు చిలుక మధుర ఉపేందర్‌ రెడ్డి ఉచితంగా నోట్‌ బుక్స్‌, పెన్సిల్స్‌, రబ్బర్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌ రెడ్డి, ఉపాధ్యాయులు మనిపాల్‌ రెడ్డి, శేషమ్మ, నిఖాత్‌, శోభ, కవిత, మాజీ కౌన్సిలర్‌ డక్కీయార్‌ నాయక్‌, నాయకులు రాజు నాయక్‌, పటేల్‌ తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా



రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్‌

సైదాబాద్‌: డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని సైదాబాద్‌ కార్పొరేటర్‌ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం సైదాబాద్‌లోని పూసలబస్తీలో నిర్మించే రోడ్డు పనులను కార్పొరేటర్‌ జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మౌలిక వసతులు కల్పించడం ద్వారా సైదాబాద్‌ డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజ్‌కుమార్‌, వనజ, విజయ, నీరజ, ఆశీష్‌, వెంకటేష్‌ పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో చిన్నారులకు ఆరోగ్యం



ఓల్డ్‌మలక్‌పేటలో నులిపురుగుల నివారణ మాత్రలు ఇస్తున్న యూపీహెచ్‌సీ డాక్టర్‌ జ్యోతి

చాదర్‌ఘాట్‌: ఏడాది వయసు పిల్లల నుంచి 19 సంవత్సరాల లోపు వారందరికీ నులిపురుగుల నివారణ కోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్బెండజోల్‌ మాత్రలు వేశారు. ఓల్డ్‌మలక్‌పేటలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, బస్తీ కమ్యూనిటీహాల్‌ నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. ఓల్డ్‌మలక్‌పేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఐఎం నాయకుడు షఫీయుద్దీన్‌ చిన్నారులకు ఆల్బెండజోల్‌ మాత్రలు వేశారు. శంకర్‌నగర్‌బస్తీలో పీహెచ్‌సీ డాక్టర్‌ జ్యోతి చిన్నారులకు ఆల్బెండజోల్‌ టాబ్లెట్లు వేశారు. నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. పిల్లలకు నులిపురుగుల నివారణ మందులు వేసే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. ఈనెల 25వ తేదీ వరకు మాత్రలు వేస్తారని తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

మన్సూరాబాద్‌: విద్యార్థులు శ్రద్ధతో, ఇష్టంతో చదవితే భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంటారని నాగోలు డివిజన్‌ కార్పొరేటర్‌ చింతల అరుణా సురేందర్‌యాదవ్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్‌ ప్రాథమిక పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్‌ స్క్రీన్‌ను శుక్రవారం ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య అందిస్తున్నారని, ప్రభుత్వ స్కూళ్లలోనే చిన్నారులను చేర్పించాలని తల్లిదండ్రులకు ఆమె విజ్ఞప్తి చేశారు.

కిడ్నాప్‌ కథ సుఖాంతం

- నిందితుడి రిమాండ్‌
- డబ్బుల కోసం బాలుడిని అపహరించిన సమీప బంధువు



సాయిని రక్షించిన పోలీస్‌

పహాడీషరీఫ్‌: డబ్బుల కోసం ఆరేళ్ల బాలుడిని కిడ్నాప్‌ చేసిన నిందితుడిని పహాడీషరీఫ్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన ఏదుల తిరుపతమ్మ, సాయికుమార్‌ దంపతుల కుమారుడు సాయి అలియాస్‌ చిన్ను(6) ఈ నెల 19న సాయంత్రం 7 గంటలకు ఇంటి ఎదుట ఆడుకుంటూ అదృశ్యమయ్యాడు. ఎవరో కిడ్నాప్‌ చేసి ఉంటారని తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదనపు డీసీపీ బి.వి.సత్యనారాయణ, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, పహాడీషరీఫ్‌ ఇన్‌స్పెక్టర్‌ పి.గురువారెడ్డి, ఎస్సై డి.శ్రీనుల పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. జల్‌పల్లి పార్థివాడలోని చెట్ల పొదల్లో బాలుడిని దాచినట్లు ఎట్టకేలకు గుర్తించారు. తిరుపతమ్మ ఇంటి సమీపంలోనే ఉండే దూరపు బంధువైన ఉత్తరప్రదేశ్‌కు చెందిన అర్జున్‌ కుమార్‌ వెర్మ(20) డబ్బులు డిమాండ్‌ చేసేందుకే కిడ్నాప్‌కు పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. 24 గంటల్లోనే బాలుడిని క్షేమంగా తల్లి చెంతకు చేర్చిన పహాడీషరీఫ్‌ పోలీసులను డీసీపీ అభినందించారు. ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలని ఆమె సూచించారు.

పక్షం రోజుల క్రితమే నగరానికి వచ్చి ...

యూపీకి చెందిన నిందితుడు అర్జున్‌ కుమార్‌ వెర్మ ఈ నెల 5న జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి, జల్‌పల్లి శ్రీరాం కాలనీలో ఉండే దగ్గరి బంధువు బర్మా ప్రేం కుమార్‌ ఇంట్లో రెండు రోజులు ఉంటానని దిగాడు. ఏదైనా పని చూపాలని కోరడంతో అర్జున్‌ను గచ్చిబౌలిలోని డీ మార్ట్‌లో స్వీపర్‌గా పనిలో పెట్టించాడు. అక్కడ పని నచ్చని అర్జున్‌ ఐదు రోజుల తర్వాత మానేశాడు. ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో వక్రమార్గంలో సంపాదించాలని భావించాడు. ఇందులో భాగంగానే ప్రేం కుమార్‌ ఇంటి పక్కనే ఉండే అతని మరదలి కుమారుడిని కిడ్నాప్‌ చేసి డబ్బులు డిమాండ్‌ చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగానే ఈ నెల 19న సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిని కిడ్నాప్‌ చేసి జల్‌పల్లి ఊరుబయట ఉన్న శ్మశాన వాటిక పొదల్లో దాచాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు.

యోగాతో ఆరోగ్య సిరి

ఘనంగా యోగా దినోత్సవం

సరూర్‌నగర్‌ ప్రియదర్శిని పార్కులో యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



దిల్‌సుఖ్‌నగర్‌ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో..



నాగోలు జైపురి కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ...



మలక్‌పేట సెయింట్‌ జేవీయర్స్‌ హైస్కూల్‌లో...





సలీంనగర్‌లో.. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు



వనస్థలిపురం భాష్యం పాఠశాలలో ...



కొత్తపేట బచ్‌పన్‌-అకడమిక్‌ హైట్స్‌ స్కూల్‌లో...



ఐఎస్‌సదన్‌లో.. కార్పొరేటర్‌ శ్వేతామధుకర్‌రెడ్డి తదితరులు



కర్మన్‌ఘాట్‌ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో..

చైతన్యపురి: ఎల్‌బీనగర్‌/మలక్‌పేట జోన్ల పరిధిలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సరూర్‌నగర్‌ ప్రియదర్శిని పార్కులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగా సాధనతో మానసిక ఒత్తిడి తగ్గుతుందని, శరీరం ధృడంగా తయారవుతుందని, సంపూర్ణ ఆరోగ్య రక్షణ కలుగుతుందని అన్నారు. చిన్నా.. పెద్దా తేడా లేకుండా అందరూ యోగాసనాలు వేయవచ్చని, ఏకాగ్రత, జ్ఞాపక శక్తి పెరుగుతుందని తెలిపారు. దిల్‌సుఖ్‌నగర్‌ సాయిబాబా ఆలయంలో మన్సూరాబాద్‌ జీఎస్‌ఐలో, హయత్‌నగర్‌ కోర్టు, ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ఇక్కడ నర్సులే వైద్యులు!

విధులపై డాక్టర్ల నిర్లక్ష్యం

- ఆలస్యంగా ఆస్పత్రికి రాక లేదా.. విధులకు పూర్తిగా డుమ్మా
- వైద్యుల కోసం రోగుల ఎదురు చూపులు
- నర్సే పరీక్షించి మందులిచ్చి పంపుతున్న వైనం
- 'సాక్షి' విజిట్‌లో సాహెబ్‌నగర్‌ పీహెచ్‌సీలో వెలుగు చూసిన దృశ్యం



సాహెబ్‌నగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేషెంట్లకు మందులు ఇచ్చి పంపుతున్న నర్సు



వైద్యుల కోసం వేచి చూస్తున్న రోగులు

ఎల్‌బీనగర్‌: ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) డాక్టర్లు విధులపై నిర్లక్ష్యం చేస్తున్నారు. విధులకు ఆలస్యంగా రావడం లేదా.. పూర్తి గైర్హాజర్‌ కావడం చేస్తున్నారు. దీంతో అక్కడ పని చేసే నర్సులే డాక్టర్ల అవతారమెత్తున్నారు. రోగులు వైద్యుల కోసం వేచి చూడకుండా నర్సులే వైద్యులను పరీక్షించి మందులు ఇచ్చి పంపుతున్నారు. ఇది ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు.. గ్రేటర్‌ పరిధిలోని బీఎన్‌రెడ్డి నగర్‌ డివిజన్‌ హెబ్‌నగర్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని నెలకొన్న పరిస్థితి. శుక్రవారం ఉదయం ఆస్పత్రిని 'సాక్షి' విజిట్‌ చేయగా వైద్యులు విధులకు ఆలస్యంగా రావడం కనిపించింది. ఉదయం 9 గంటలకు విధులకు రావాల్సి ఉండగా, తీరిగ్గా 10.30 గంటలకు వచ్చారు.

విధులకు డాక్టర్లు దూరం....

సాహెబ్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) లో ఇద్దరు డాక్టర్లు, ఒక నర్సు, మరొకరు ల్యాబ్‌ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. డాక్టర్లు సమయానికి ఆస్పత్రికి రాకపోవడం..రోజుల తరబడి విధులకు డుమ్మా కొడుతుండటంతో ఇక్కడ పనిచేసే నర్సే డాక్టర్‌ అవతారమెత్తి ప్రతి రోజూ ఆస్పత్రికి వచ్చే రోగులను పరీక్షించి మందులు ఇస్తోంది.

- డాక్టర్లు ఉదయం 9 గంటలకు విధులకు రావాల్సి ఉండగా, తీరిగ్గా 10.30 గంటలకు రావడం లేదా పూర్తిగా డుమ్మా కొడుతున్నారని తెలిసింది.
- ప్రతి రోజూ వివిధ ఆరోగ్య సమస్యలతో వస్తున్న రోగులు డాక్టరు వచ్చే వరకు వేచి చూడాల్సి వస్తోంది.
- ప్రతి రోజూ ఈ ఆస్పత్రికి సుమారు 100 మంది వరకు సమీప బస్తీలు, ఇతర కాలనీవాసులు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు.
- వైద్యుల కోసం వేచి చూస్తున్న రోగులకు ఓపిక నశించిపోతుండటంతో నర్సే తనకు తోచిన మందులు ఇచ్చి పంపుతోందని పలువురు రోగులు పేర్కొన్నారు.
- డాక్టర్లు మాత్రం తమ సొంత పనులు పూర్తి చేసుకున్న తర్వాత తీరిగ్గా విధుల్లోకి వస్తున్నారని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు సార్లు వచ్చినా డాక్టరు లేడు..

తాను సాహెబ్‌నగర్‌లోనే ఉంటానని, ఇప్పటికి నాలుగుసార్లు ఈ ఆస్పత్రికి వస్తే ఒక్కసారి కూడా డాక్టర్‌ లేడని నగేష్‌ అనే వ్యక్తి తెలిపాడు. ఎప్పుడు వచ్చినా నర్సు మాత్రమే చూసి మందులు ఇస్తోందని వాపోయాడు.

చర్యలు తీసుకుంటాం..

విధుల పట్ల నిర్లక్ష్యం వహించే డాక్టర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారని 'సాక్షి' ప్రతినిధి ఫోన్‌ ద్వారా రంగారెడ్డి జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వరావును వివరణ కోరగా, విచారణ జరిపి మెమో జారీ చేస్తామని తెలిపారు. ప్రతి రోజూ విధులకు డుమ్మాకొడితే సహించేది లేదని, విధిగా సమయానికి విధులకు హాజరు కావాలని ఆయన స్పష్టం చేశారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'భారతి అల్ట్రా ఫాస్ట్‌'తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



డీలర్‌కు భారతి అల్ట్రాఫాస్ట్‌ సిమెంట్‌ను అందజేస్తున్నశివకుమార్‌

నాగోలు: సిమెంట్‌ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్‌ అల్ట్రాఫాస్ట్‌ పేరుతో ఫాస్ట్‌ సెట్టింగ్‌ సిమెంట్‌ 5 స్టార్‌ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని సంస్థ సీనియర్‌ టెక్నికల్‌ ఇంజినీర్‌ శివ కుమార్‌ తెలిపారు. శుక్రవారం నాగోలులోని శ్రీ సాయి దివ్య స్టీల్‌, సిమెంట్‌ డీలర్‌ షాప్‌ లో తాపీ మేస్త్రీల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శివ కుమార్‌ మాట్లాడుతూ, మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు అల్ట్రాఫాస్ట్‌ సరైన ఎంపిక అని అన్నారు. అల్ట్రాఫాస్ట్‌ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందజేస్తామన్నారు. స్లాబ్‌ కాంక్రీట్‌ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్‌ ఇంజినీర్లు సైట్‌ వద్దకు వచ్చి సహాయ పడతారని చెప్పారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రా ఫాస్ట్‌ రూ. 20 మాత్రమే అధికంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్లు వెంకటేష్‌ మాట్లాడుతూ, భారతి సిమెంట్‌ సర్వీస్‌ చాలా వేగంగా ఉంటుందన్నారు. సమావేశంలో టెక్నికల్‌ ఆఫీసర్‌ బద్రి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



108 కలశాలతో అభిషేకం చేస్తున్న భక్తులు

మన్సూరాబాద్‌: నాగోలు డివిజన్‌ శ్రీసాయినగర్‌ కాలనీలోని దుర్గాదేవి ఆలయ 19వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం దుర్గాదేవికి పంచామృత అభిషేకం, అష్టోత్తర శత (108) కలశాలతో అభిషేకం చేశారు. ఆదివారం 10 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన జరుగుతుందని, అనంతరం అమ్మవారి శేషవస్త్రాల వేలం పాట నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్‌ పోచబోయిన గణేష్‌యాదవ్‌ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు యాదగిరి, హనుమంతరావు, రమణ మూర్తి, కేశవులు, మురళీ, అర్చకులు మురళీకృష్ణ శర్మ పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో విశేష చండీ హోమం

సైదాబాద్‌: మాతామైదాన్‌లో కొలువుదీరిన శ్రీవిజయదుర్గా మాతా ఆలయంలో ప్రతి నెలా పూర్ణిమ తిథి నాడు విశేష చండీ హోమం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో ఆలయ అర్చకులు సుద్దాల నరసింహ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా విశేష చండీ హోమం నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. హోమం, వ్రతంలో భక్తులు పాల్గొన్నారు. ప్రతి నెలా పూర్ణిమ తిథి నాడు నిర్వహించే విశేష చండీ హోమం, సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఆలయ అర్చకులు సుద్దాల నరసింహను ఫోన్‌ నం .7989888801లో సంప్రదించాలని ఆలయ కమిటీ పేర్కొంది.

అన్ని గురుకులాల్లో జేఈఈ, నీట్‌ కోచింగ్‌ ప్రారంభించాలి

చాదర్‌ఘాట్‌: తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్‌ గురుకులాలు, జూనియర్‌ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులందరికీ జేఈఈ, మెయిన్స్‌, నీట్‌ తదితర జాతీయ స్థాయి ఎంట్రన్స్‌ పరీక్షలకు కోచింగ్‌ ఇప్పించాలని ఇండియన్‌ స్టూడెంట్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు పాపని నాగరాజు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గురుకులాలు, జూనియర్‌ కాలేజీల్లో లక్షలాది మంది చదువుతుండగా, వారిలో కొందరికే ప్రస్తుతం సీఈఓ పేరుతో లాంగ్‌టర్మ్‌ కోచింగ్‌ ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఆ విధంగా కాకుండా రాష్ట్రంలోని అన్ని గురుకులాల విద్యార్థులకు 37 రకాల జాతీయస్థాయి ఎంట్రన్స్‌ పరీక్షల్లో ప్రభుత్వం తర్ఫీదు ఇప్పించాలని ఆయన డిమాండ్‌ చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కొత్తపేట కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌ అన్నారు. కొత్తపేట డివిజన్‌ స్నేహపురి కాలనీలో రోడ్‌ నం. 5 లో రూ.42 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌ కుమార్‌ పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వర్షాకాలంలో ఎక్కడ కూడా నీళ్ల ఆగకుండా సరైన లెవెల్స్‌ చూసుకుని రోడ్డు వేసేలా చూడాలని జీహెచ్‌ఎంసీ ఏఈ మాత్రునాయక్‌కు సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లు, నాయకులు కొత్త తిరుమల్‌, వెంకట్‌ రెడ్డి, తోట మహేందర్‌ యాదవ్‌, తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసులకు అసౌకర్యం కల్గిస్తే సహించం: ఎమ్మెల్యే



అండర్‌ కేబుల్‌ కోసం తవ్విన రహదారిని పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

చంపాపేట: వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాలనీ రహదారులను ఇష్టానుసారంగా తవ్వేసి కాలనీవాసులకు అసౌకర్యం కల్గిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. చంపాపేట డివిజన్‌ నెహ్రూనగర్‌ కాలనీలో స్థానికుడు తన స్థలం మీదుగా ఏర్పాటు చేసిన 33 కేవీ హైటెన్షన్‌ విద్యుత్‌ వైర్లను కాలనీ రహదారిలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తుండగా శుక్రవారం కట్టా వెంకటేశ్‌ ఆధ్వర్యంలో కాలనీవాసులు ఆందోళన నిర్వహించి పనులను అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సుధీర్‌రెడ్డి హుటాహుటిన కాలనీకి వచ్చి అండర్‌ కేబుల్‌ పనులను వెంటనే నిలిపివేయాలని చెప్పారు. అండర్‌ కేబుల్‌ పనులకు అనుమతి ఇచ్చిన అధికారులతో తాను మాట్లాడి అనుమతులను రద్దు చేయిస్తానని కాలనీవాసులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు రాజిరెడ్డి, రాఘవాచారి, రవి ముదిరాజ్‌, ఉమా మహేశ్వర్‌, చందుయాదవ్‌, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సతీష్‌గౌడ్‌, యాదగిరి, కొత్తపేట ప్రభాకర్‌ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు



దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ అలకాపురంలోని శృంగేరి శంకర మఠంలోని శారదా చంద్రమౌళేశ్వర స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా స్వామివారి పాదుకాపూజ,గోపూజ, అమ్మవారి మహాకాళి నిజరూప దర్శనం, కుంకుమార్చన, వేద పారాయణం, శారదా అమ్మవారి లక్ష మూల మంత్ర జపం నిర్వహించారు. కార్యక్రమంలో శంకర మఠం బ్రాంచి అధికారి కొవ్వడి శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

జయశంకర్‌ సార్‌కు ఘన నివాళి



చంపాపేటలో జయశంకర్‌ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఆర్‌కేపురంలో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

మన్సూరాబాద్‌: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య ప్రొఫెసర్‌ జయశంకర్‌ సార్‌ వర్ధంతిని ఎల్‌బీనగర్‌ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఎల్‌బీనగర్‌లోని జయశంకర్‌ విగ్రహానికి పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, తెలంగాణ మలిదశ ఉద్యమకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- చంపాపేట బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు ముడుపు రాజిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయశంకర్‌ విగ్రహానికి
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎల్‌బీనగర్‌లోని విగ్రహానికి టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా నివాళులర్పించారు.
- దిల్‌సుక్‌నగర్‌ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మధురానగర్‌లోని మార్కెట్‌ వద్ద సంస్మరణ సభ నిర్వహించారు. జయశంకర్‌ సార్‌ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఎల్‌బీనగర్‌లో...



మధురానగర్‌ మార్కెట్‌ వద్ద...